# ప్రజా ముచ్చట

తెలుగు దినపత్రిక

మా ప్రతీ అక్షరం – ప్రజల ముచ్చటే



ప్రజా ముచ్చట
తెలుగు దిన పత్రిక

విలేకర్లు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఆర్.సి. ఇంఛార్జ్‌లు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.

అనుభవం, ఆసక్తిగలవారు 99086 89674 లో సంప్రదించగలరు



హైదరాబాద్ | బుధవారం,మే14,2025 | ఎడిటర్: పండ్ల నాగరాజు | పేజీలు: 4 వేల: 1


# యుద్ధక్షేత్రంలో జై భారత్ మాతా నినాదాలు

- ఆపరేషన్ సిందూర్ విజయంపై మోదీ ప్రసంగం
- మోదీ వ్యాఖ్యలను రెచ్చగొట్టేవి, వివాదాస్పదమైనవిగా పేర్కొన్న పాక్
- అయినప్పటికీ కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉన్నామని వెల్లడి
- యుద్ధక్షేత్రంలో జై భారత్ మాతా నినాదాలు
- ఆదంపూర్ ఎయిర్ బేస్ ను సందర్శించిన మోడీ
- సైనికులకు సెల్యూట్ చేసి ముచ్చటించిన ప్రధాని
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



మే13,(నిజం చెపుతాం) భారత సాయుధ బలగాలు పాకిస్థాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' విజయం గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం నాడు చేసిన ప్రసంగం, పాకిస్థాన్‌కు ఆయన జారీ చేసిన హెచ్చరికలు ఇరు దేశాల మధ్య మరోసారి మాటల యుద్ధానికి దారితీశాయి. మోదీ వ్యాఖ్యలను 'రెచ్చగొట్టేవి, వివాదాస్పదమైనవి'గా పేర్కొంటూ పాకిస్థాన్ ప్రభుత్వం నేడు తీవ్రంగా ఖండించింది. అయితే, కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేసింది. సోమవారం జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోదీ, 'ఆపరేషన్ సిందూర్'ను విజయవంతంగా పూర్తిచేసిన భారత సాయుధ బలగాలను అభినందించారు. ఈ ఆపరేషన్‌లో కీలక ఉగ్రవాద స్థావరాలు ధ్వంసమయ్యాయని, డజన్ల కొద్దీ ఉగ్రవాదులు హతమయ్యారని, 'అత్యంత కీలక' లక్ష్యాలు అనదగ్గ కొందరు ఉగ్రవాదులు కూడా మృతుల్లో ఉన్నారని ఆయన తెలిపారు. పాకిస్థాన్‌పై ప్రతీకార చర్యలను భారత్ కేవలం విరామం ఇచ్చిందని, పూర్తిగా ముగించలేదని మోదీ గట్టిగా హెచ్చరించారు. కాల్పుల విరమణకు తొలుత ఇస్లామాబాదే కాళ్లబేరానికి వచ్చిందని ఆయన గుర్తుచేశారు. "ఉగ్రవాదం, చర్చలు కలిసి సాగవు, ఉగ్రవాదం, వాణిజ్యం ఒకేసారి నడవవు, అలాగే నీరు, రక్తం కలిసి ప్రవహించలేవు" అని మోదీ స్పష్టం చేశారు.



# జమ్మూకశ్మీర్ లో ముగిసిన ఎన్‌కౌంటర్...

- షోపియాన్ జిల్లాలో భీకర ఎన్‌కౌంటర్
- ముగ్గురు లష్కరే తోయిబా ఉగ్రవాదులు హతం
- షుక్రు కెల్లర్ అటవీ ప్రాంతంలో పక్కా సమాచారంతో కార్డన్ సెర్చ్

మే13,( దక్షిణ కశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో ఈరోజు జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు లష్కరే తోయిబా ఉగ్రవాదులు హతమయ్యారు. సరిహద్దు అవతల ఉన్న ఉగ్రవాద శిబిరాలపై కఠిన చర్యలు తీసుకున్న భద్రతా దళాలు, ఇప్పుడు లోయలోపల కూడా ఉగ్రవాద నిర్మూలన చర్యలను తీవ్రతరం చేశాయి. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, షోపియాన్ జిల్లా పరిధిలోని షుక్రు కెల్లర్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న పక్కా సమాచారం భద్రతా దళాలకు అందింది. దీంతో అప్రమత్తమైన సైనిక బృందాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి, కార్డన్ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. గాలింపు చర్యలు కొనసాగుతుండగా, ఓ చోట ఉన్న ఉగ్రవాదులు భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా దళాలు తక్షణమే ప్రతిస్పందించి, ఎదురుకాల్పులు జరిపాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య భీకరమైన కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు లష్కరే తోయిబా ఉగ్రవాదులు మరణించినట్లు అధికారులు ధృవీకరించారు. హతమైన ఉగ్రవాదుల నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆపరేషన్ జరిగిన ప్రాంతంలో ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, పరిస్థితి అదుపులోనే ఉందని అధికారులు తెలిపారు. కశ్మీర్ లోయలో ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టే దిశగా భద్రతా దళాలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయని వారు స్పష్టం చేశారు.

# పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

- శివాపురం వద్ద బొప్పాయి లోడ్ బొలెరోను ఢీకొన్న లారీ గాయపడిన మరికొందరు
- మంత్రి లోకేశ్ దిగ్భ్రాంతి.. అండగా ఉంటానని హామీ
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం



పల్నాడు మే13 పల్నాడు జిల్లాలో ఈ ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదం నింపింది. ఈ దుర్ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోగా పలువురు గాయపడ్డారు. బొలెరో వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఈ దారుణం జరిగింది. వినుకొండ మండలం శివాపురం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బొప్పాయి కాయలతో వెళుతున్న బొలెరో వాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరొకరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో తుదిశ్వాస విడిచాడు. మృతులంతా ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం గడ్డమీదపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలుగా పోలీసులు గుర్తించారు. పనుల నిమిత్తం వీరు ప్రయాణిస్తుండగా ఈ దుర్ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో గడ్డమీదపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# 17న ఐపీఎల్ పునఃప్రారంభం..

- మే 17 నుంచి 6 వేదికలలో ఐపీఎల్‌ను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించిన బీసీసీఐ
- సవరించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 3న ఫైనల్
- 17 నుంచి 27 వరకు మిగిలిన లీగ్ మ్యాచులు
- ఇందులో ఒక్కటి కూడా ఉప్పల్, విశాఖ స్టేడియాల్లో నిర్వహించని వైనం

*న్యూఢీల్లీ,మే13.) భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఐపీఎల్‌ను మే 17 నుంచి ఆరు వేదికలలో తిరిగి ప్రారంభించాలని బీసీసీఐ సోమవారం నిర్ణయించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 3న ఫైనల్ జరగనుంది. ఇరుదేశాల మధ్య పరిస్థితులు ఒకింత సద్దుమణగడంతో బీసీసీఐ నిన్న అత్యవసరంగా సమావేశమై ఐపీఎల్ తదుపరి షెడ్యూల్‌ను ఖరారు చేసిన విషయం తెలిసిందే. మిగిలిన 17 మ్యాచ్‌ల కోసం దేశంలో ఆరు వేదికలను ఖరారు చేసింది. ఇందులో జైపూర్, ముంబయి,*




*బెంగళూరు, లక్నో, అహ్మదాబాద్, ఢిల్లీ ఉన్నాయి. ఈ లీగ్ మ్యాచుల్లో ఒక్కటి కూడా ఉప్పల్, విశాఖ స్టేడియాల్లో నిర్వహించకపోవడం తెలుగు రాష్ట్రాల అభిమానులకు నిరాశ కలిగించే విషయం విషయం.*



# ప్రజలందరి సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం...

- దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఇందిరమ్మ ప్రభుత్వం.
- బయ్యారం మండలంలో లక్ష్మీనరసింహపురంలో 33/11 కె వి విద్యుత్ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన.
- బయ్యారం పెద్ద చెరువును అన్ని విధాల అభివృద్ధి చేస్తాం.
-రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.

బయ్యారం:మే. 13.)మహబూబాబాద్ జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని బయ్యారం మండలం లక్ష్మీనరసింహపురంలో 33/11 కె వి విద్యుత్ సబ్ స్టేషన్ కు మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేసిన అనంతరం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన లక్ష్మి నర్సింహపురం,గంధంపల్లి ప్రజా బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజలపై ఒక్క రూపాయి భారం మోపకుండా వేల కోట్లతో సంక్షేమ పథకాలు తీసుకువస్తున్నాం అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురాబోతున్నట్టు తెలిపారు. గిరిజన నియోజకవర్గాల్లో అదనంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వివరించారు. అటవీ హక్కుల చట్టం కింద ప్రభుత్వ హయాంలో పట్టాలు పొందిన గిరిజన రైతులు సాగు చేసుకునేందుకు వీలు కల్పించదని అన్నారు. గిరిజన రైతులకు భరోసా కల్పించేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని ఈనెల 18న నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట లోని చెంచు కాలనీలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదగా ప్రారంభించబోతున్నాం

# కల్తీ మద్యం తాగి 15 మంది కూలీల మృతి

- మృతుల్లో ఎక్కువ మంది ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులే
- ప్రధాన నిందితుడు ప్రభ్‌జిత్ సింగ్ సహా ఐదుగురి అరెస్ట్
- గతంలోనూ పంజాబ్‌లో కల్తీ మద్యం మరణాలు



పంజాబ్ మే13, పంజాబ్‌లోని అమృత్‌సర్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మజీతా ప్రాంతంలోని నాలుగు గ్రామాలలో కల్తీ మద్యం సేవించి 15 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. మృతులలో అత్యధికులు ఇటుక బట్టీలలో పనిచేస్తున్న కార్మికులేనని, భంగాలీ, మరారీ కలాన్ థెర్వాల్, పాతల్‌పురి గ్రామాలకు చెందిన వారని అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ప్రధాన నిందితుడు ప్రభ్‌జిత్ సింగ్‌ను అరెస్టు చేసినట్లు అమృత్‌సర్ రూరల్ పోలీసులు వెల్లడించారు. కల్తీ మద్యం సరఫరా వెనుక ప్రభ్‌జిత్ సింగ్ సూత్రధారి అని తేలిందన్నారు. దీంతో పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రభ్‌జిత్ సింగ్ సోదరుడు కుల్బీర్ సింగ్ అలియాస్ జగ్గూ, సాహిబ్ సింగ్ అలియాస్ సరాయ్, గుర్జంత్ సింగ్, జీతా భార్య నిందర్ కౌర్‌లను కూడా అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. బాధితులందరూ ఆదివారం సాయంత్రం ఒకే షాపులో మద్యం కొనుగోలు చేసినట్లు తేలిందని అధికారులు వెల్లడించారు.

# ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్న మోడీ సర్కార్

### - సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ




పెన్ పహాడ్/ప్రజా ముచ్చట, మే 13:మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్ ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేస్తుందని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో హమాలి కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూఈనెల 20 వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ సంస్థలన్నీటిని కార్పొరేషన్ పెట్టి దేశాన్ని దివాలా తీపిస్తున్నారని, ఎంతో కాలంగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాల రాస్తున్నారని ఆయన ఆరోపించారు. మోడీ ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాల విధానాలపై ఈనెల 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె ను కర్షకులు, కార్మిక లోకం పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. రెక్కాడితేనే డొక్కాడని హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని , ఆరోగ్య భీమా సౌకర్యం వర్తింపచేయాలని, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హామాలి సంఘం ముఠామేస్త్రి భూక్య జగపతి, కార్మికులు నునావత్ పాండు, ధారావత్ మంగ్య, కిషన్, కీమా, రమేష్, నాగు తదితరులు పాల్గొన్నారు..

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి




### - ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్

హుజూర్ నగర్,ప్రజా ముచ్చట:హుజూర్ నగర్ ఏ ఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం హుజూర్నగర్ సిపిఐ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ మాట్లాడుతూ... దేశ జనాభాలో సగం పైగా ఉన్న కార్మిక లోకానికి కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం చట్ట సవరణ పేరుతో పెట్టుబడి వర్గానికి అనుకూలంగా బడా పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతూ వారు కనుసన్నల్లో ప్రభుత్వాలు నడుపుతూ కార్మిక చట్టాలను కాలరాస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వంపై నిరసనగా ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అధిక సంఖ్యలో కార్మికుల పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేయాలని వారు కార్మికు లోకానికి పిలుపునిచ్చారు. దేశంలో స్వతంత్రానికి ముందే అనేక హక్కుల సాధించుకున్నప్పటికీ నేటి నరేంద్ర మోడీ ప్రభుత్వం 44 రకాల చట్టాలను నాలుగు కోడ్ లుగా మార్చి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుంది ఇలాంటి కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తున్న నరేంద్ర మోడీని వారి విధానాలకు నిరసనగా జరిగే సమ్మెలో కార్మికులు అందరూ వారి వారి పరిశ్రమల్లో కారా?నాలో సమ్మె నోటు ఇచ్చి సమ్మెలో స్వచ్ఛందంగా పాల్గొనాలని పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిద్దాం కార్మిక హక్కులను కాపాడుకుందాం సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి అన్ని కార్మికుల పనికి పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జెట్టి ప్రసాద్,ముడుసు పాపారావు,బేజ్జం రమేష్, నరిసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# గోర్ భాష పై మమకారం..!






### - లంబాడి భాషలోనే పెండ్లి పత్రిక ముద్రణ

మిర్యాలగూడ, ప్రజా ముచ్చట:బంజరాలను ఆకట్టుకుంటున్న మక్ల నాయక్ కూతురి లగ్న పత్రిక ఆయనో ప్రభుత్వ ఉపాధ్యాయుడు బంజారా సంఘానికి నేతృత్వం వహిస్తున్నాడు. బంజారా భాషపై విపరీతమైన మమకారం. జాతి పట్ల వున్న ప్రేమను చూపించనుకున్నాడు. అంతే బిడ్డ వివాహం నిశ్చయం అయింది. లగ్న పత్రిక రాసుకున్నారు. ఇదే అదునుగా భావించిన ఆ నేత బంజారా జాతిపై వున్న ప్రేమ తన కూతురు వివాహ ముహూర్తాల పత్రికను బంజారా భాషలో ముద్రించి బంజారా జాతి పట్ల అభిమానాన్ని పది మందికి తెలియజేయాలని అనుకున్నాడు. వెంటనే బంజారా ఉద్యోగుల సంఘం నాయకులతో చర్చించి బంజారా భాషలో పత్రిక ముద్రణ చేయించారు. పత్రికలో పెండ్లి వివరాలు,తేదీ,స్థలం,ఆహ్వానీతులను భాషలోని పిలవడం బంజారా నాయకులను ఆకట్టుకుంటుంది. బంజారా జాతిపై వున్న అభిమానంతో పెండ్లి పత్రిక ముద్రణ చేయించిన మిర్యాలగూడ పట్టణానికి చెందిన మక్ల నాయక్ పలువురు బంజారా ఉద్యోగులు, నాయకులు అభినందిస్తున్నారు.

### భాషలో పత్రిక ముద్రణ అభినందనీయం...

బంజారా జాతిపై అభిమానంతో పెండ్లి పత్రిక ముద్రణ బంజారా భాషలో ముద్రించి పంపిణి చేస్తున్న బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు దనవత్ మక్లా నాయక్ అభినందనీయుడని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర అధ్యక్షుడు దశరథ్ నాయక్ తెలిపారు. ఆయన తీసుకున్న ఈ నిర్ణయం బంజారా నాయకులందరికీ, ఉద్యోగులకు అదర్శనియమని తెలిపారు

# కార్మికుల శ్రమను సిమెంట్ పరిశ్రమలు దోపిడి చేస్తున్నయ్..






### - టిఎన్టియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి శీతల రోషపతి.

మేళ్లచెరువు, ప్రజా ముచ్చట:సిమెంటు పరిశ్రమలలో కాంట్రాక్ట్ వర్కర్స్ అనే ముద్దు పేరుతో పరిశ్రమ యాజమాన్యంలు కార్మికుల శ్రమన్ దోపిడీ చేస్తున్నారని కృష్ణ పట్టే ఏరియా సిమెంట్ క్లస్టర్ కమిటీ సభ్యులు టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి ఆరోపించారు. మేళ్లచెరువు మండలంలో వివిధ సిమెంట్ పరిశ్రమలలో పనిచేసే కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 20,న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్క కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని రోషపతి కార్మికులకు పిలుపునిచ్చారు. వివిధ పరిశ్రమలలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పనా ఏ ఒక్క యాజమాన్యం ఇది అమలు చేయటం లేదని అమలు చేయని యాజమాన్యంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఒక పరిశ్రమలో పొద్దున్నే పెద్ద పెద్ద యోగాలు గురించి చెప్పిన పరిశ్రమ యాజమాన్యం కార్మికుల బైకులు కూడా వదలకుండా స్టాండింగ్ పీజులు వసూల్ చేయటం ఎంత అన్యామో ఎంత మోసమో ప్రజలు గ్రహించాలని ఇది ప్రతి ఒక్క పార్టీ ఖండించాలని కోరారు. ఇలాంటిది వసూల్ ఏ పరిశ్రమలో కూడా లేదు తక్షణమే కార్మికులు న్యాయమైన వేతనం కనీస వేతనం నెలకి రూ. 26,000 ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు లేని ఎడల ఈనెల 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో ప్రతి ఒక్క కార్మికులు పాల్గొనాలని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్,వెంకటేష్,నాగేశ్వరరావు,ఎంకన్న,శ్రీను, అజార్,కృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ నిధి నిధుల దుర్వినియోగంపై విచారణ




పెన్ పహాడ్/ప్రజా ముచ్చట, మే 13:మండల పరిధిలోని నాగులపహాడ్ గ్రామంలో 2023 అక్టోబర్ నెలలో నిర్వహించిన సోషల్ ఆడిట్ లో 15 లక్షల 25 వేల రూపాయల స్త్రీ నిధి నిధులు వివోఏ కుర్రి ప్రమీల సొంత ఖర్చులకు వాడుకొని దుర్వినియోగం చేసినట్లు అప్పట్లో తేలింది. కానీ ఇప్పటివరకు ఆ నిధులను ఆమె స్త్రీనిధికి చెల్లించలేదు. ఈ విషయమై గ్రామానికి చెందిన నక్క సందీప్ సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన గ్రీవెన్స్ లో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు పై స్పందించిన అధికారులు మంగళవారం గ్రామానికి విచ్చేసి మరో విచారణ చేపట్టారు. గ్రామంలో స్త్రీ నిధి రుణాలు తీసుకున్న 25 సంఘాలకు గాను మంగళవారం 6 సంఘాలను విచారణ చేయడం జరిగింది. ఇట్టి విచారణలో మరో 5 లక్షల రూపాయలు దుర్వినియోగం అయినట్లుగా తేలిందని ఏపిఎం అజయ్ నాయక్ తెలిపారు. మరో రెండు రోజులు గ్రామంలో మిగతా సంఘాల ను విచారణ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. స్త్రీ నిధి నిధులు దుర్వినియోగం చేసిన వివోఏ అట్టి నిధులను చెల్లించకపోయిన ఎడల ఆర్ఆర్ ఆక్ట్ ప్రకారం చట్ట ప్రకారం చర్యలు తీసుకొని రికవరీ చేయనున్నట్లు ఏపీఎం తెలిపారు. ఇట్టి విచారణ కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ జ్యోతి, సీసీలు పద్మావతి, శైలజ, స్వరూప, సంఘ బంధం అధ్యక్షురాలు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌కు నాయకత్వ బాధ్యతలపై హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు



**- బీఆర్ఎస్‌లో విభేదాలు లేవన్న హరీశ్ రావు**
**- కేటీఆర్‌కు పార్టీ బాధ్యతలు ఇస్తే స్వాగతిస్తానన్న మాజీ మంత్రి**
**- కేసీఆర్ ఆదేశాలకు కట్టుబడి ఉంటానని స్పష్టీకరణ**
**- కాంగ్రెస్ హామీల వైఫల్యంపై తీవ్ర విమర్శలు**
**- ఎన్నికలొస్తే బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ధీమా**

బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలున్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తెరదించారు. పార్టీలో ఎలాంటి వర్గపోరు లేదని స్పష్టం చేస్తూనే, కేటీఆర్ కు పార్టీ బాధ్యతలు అప్పగించడంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో తనకు, కేటీఆర్‌కు మధ్య విభేదాలున్నాయన్న ప్రచారాన్ని హరీశ్ రావు కొట్టిపారేశారు. ఒకవేళ కేటీఆర్‌కు పార్టీ బాధ్యతలు అప్పగిస్తే తాను తప్పకుండా స్వాగతిస్తానని ఆయన స్పష్టం చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తాను గౌరవిస్తానని, ఆయన ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తానని తెలిపారు. "కేసీఆర్‌కు నేను రాముడికి హనుమంతుడిలా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను. కేసీఆర్ మాటే నా బాట. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆ గీత దాటే ప్రసక్తి లేదు" అని హరీశ్ రావు స్పష్టం చేశారు. పార్టీలో ఎలాంటి వర్గ విభేదాలు లేవని, అందరం కేసీఆర్ నాయకత్వంలోనే కలిసికట్టుగా పనిచేస్తామని ఆయన తెలిపారు. గతంలోనూ ఈ అంశంపై చాలాసార్లు స్పష్టతనిచ్చానని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహంరాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేతిలో మోసపోయామని ప్రజలు గ్రహించారని, తిరిగి కేసీఆర్ పాలన కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలను ప్రస్తుత ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలంతా బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని, కాంగ్రెస్ పాలన పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

# మన ఖజానా పెరగాలి: అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

రాష్ట్ర ఆర్థిక వనరులను గణనీయంగా పెంచేందుకు పటిష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేడు సచివాలయంలో ఆదాయార్జన శాఖలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో, గత మూడు దశాబ్దాల ఆదాయ సరళిని లోతుగా అధ్యయనం చేసి, భవిష్యత్తుకు పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 1,34,208 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించినట్లు సీఎం తెలిపారు. పన్ను ఎగవేతలను సమర్థవంతంగా అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, కృత్రిమ మేధను (ఏఐ) వినియోగించుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అన్ని శాఖల సమాచారంతో 'డేటా లేక్' ఏర్పాటు చేయాలని, ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. దీని ద్వారా పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, ఎగవేతలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. బంగారం కొనుగోళ్లలో రాష్ట్రం ముందున్నప్పటికీ, పన్నుల రూపంలో ఆశించిన ఆదాయం రాకపోవడంపై దృష్టి సారించాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎర్రచందనం విక్రయాలకు, దాని విలువ నిర్ధారణకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. వేల కోట్ల విలువైన ఎర్రచందనం రాష్ట్రానికి ఒక వరం లాంటిదని, దీనిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఖజానాకు భారీ ఆదాయం సమకూర్చుకోవచ్చని అన్నారు. కమిటీ ద్వారా ఎర్రచందనం నిల్వలు, వాటి విలువపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

# ఫాసిజంపై సాధించిన విజయం...

మే 9వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ఫాసింజపై సాధించిన విజయం ఎనభయ్యవ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్నారు. 1945వ సంవత్సరంలో సరిగ్గా ఇదే రోజున సోషలిస్టు రష్యాకు చెందిన రెడార్మీ హిట్లర్ ఫాసిస్టు మూకలను నిర్ణయాత్మకంగా ఓడించి బెర్లిన్‌లోని రీచ్‌స్టాగ్ (జర్మనీ పార్లమెంట్ భవనం)పై ఎర్రజెండాను ఎగురవేశాయి. జాత్యహంకారంతో యావత్ ప్రపంచాన్ని పాదాక్రాంతం చేసుకోవాలని మొదలుపెట్టిన యుద్ధంలో అనివార్యంగా ఓటమిని చవిచూడనున్నానని ముందుగానే గ్రహించిన నాజీ హిట్లర్ ఏప్రిల్ 30న ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులలో ఫాసిజంపై సాధించిన విజయానికి అత్యంత ప్రాముఖ్యత ఏర్పడింది. 1920వ దశకంలో నెలకొన్న తీవ్ర ప్రపంచ ఆర్థిక మాంద్యాన్ని అధిగమించడానికి, రాజ్యాధికారంపై ఆధిపత్యం నిలబెట్టుకోవడానికి పాలక శక్తులు ఫాసిజాన్ని ఆశ్రయించాయి. ప్రపంచవ్యాపంగా అనేక దేశాలలో కార్మికవర్గ పోరాటాలు వెల్లువెత్తి, కమ్యూనిస్టు ఉద్యమాలు ఉధృతంగా పెరుగుతూ వచ్చిన దశాబ్దాల కాలం అది. రష్యాలో 1917లో మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవం విజయవంతం కావడం, సమాజంలో అన్ని రకాల దోపిడీలను నిర్మూలించడంలో గొప్ప ముందంజ వేయడం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల ప్రజానీకానికి స్ఫూర్తినిచ్చింది. అధికారం కోల్పోయిన పాత పాలక వర్గాలు రెచ్చగొట్టిన అంతర్యుద్ధాన్ని, చుట్టుముట్టిన సామ్రాజవాద శక్తులను నవజాత రష్యన్ సోషలిస్టు సమాజం విజయవంతంగా ఎదుర్కొని అధిగమించిన తీరును ప్రత్యక్షంగా గమనించారు. ఈ పరిణామాలతో స్ఫూర్తి పొందిన జర్మనీ, హంగేరీ దేశాలలోని కార్మికవర్గం ఆయా దేశాల్లోని పాలక వర్గాలను అధికారం నుండి కూలదోయడానికి ప్రయత్నించింది. వివిధ కారణాల రీత్యా ఈ తిరుగుబాట్లు విఫలం అయ్యాయి. కానీ పాలక బూర్జువా వర్గం ఈ పరిణామాలతో అప్రమత్తం అయ్యింది. ఆర్థిక సంక్షోభ కాలంలో కార్మిక వర్గానికి నాయకత్వం వహించిన కమ్యూనిస్టు పార్టీలు అధికారం చేజిక్కించుకోకుండా చూడడానికి పాలక శక్తులు రకరకాల ఫాసిస్టు ఎత్తుగడలను అవలంభించాయి. ఇటలీలో ముస్సోలినీ, జర్మనీలో హిట్లర్, జపాన్‌లో



హిరోహితోలు ఫాసిస్టు శక్తులకు ప్రాతినిధ్యం వహించారు. ఆయా దేశాల్లో ఫాసిజం తలెత్తడానికి దేశీయ బూర్జువా వర్గంతో పాటు ఇంగ్లాండ్, అమెరికా, ఫ్రాన్స్ వంటి పెట్టుబడిదారీ దేశాల్లోని బూర్జువావర్గం కూడా ఎంతగానో తోడ్పడింది. ఫోర్ట్, రాక్‌ఫెల్లర్, కోకోకోలా వంటి బడా పారిశ్రామిక సంస్థలు ఫాసిజం అభివృద్ధి చెందడానికి బహిరంగంగానే తోడ్పాటునిచ్చాయి. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకునే ఫాసిజం అంటే 'కార్మికవర్గ విప్లవాలకు బెదిరి ఫైనాన్స్ పెట్టుబడి బాహాటంగా ఉగ్రవాద నియంతృత్వానికి పాల్పడడం' అని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నాయకుడు, ఫాసిస్టు వ్యతిరేక యోధుడు అయిన జార్జి డెమిట్రోవ్ నిర్వచించాడు. హిట్లర్ జర్మనీని పున: సైనికీకరించడం గురించి మొదట్లో పెట్టుబడిదారీ దేశాల్లోని బూర్జువావర్గం ఆందోళన పడలేదు. ఈ భూమ్మీద నుండి కమ్యూనిజాన్ని తుడిచిపెడతాను అన్న హిట్లర్ లక్ష్య ప్రకటనను విశ్వసించారు. వాళ్ళు కోరుకునేది కూడా అదే. నాడు బ్రిటన్ ప్రధానిగా ఉన్న విన్‌స్టన్ చర్చిల్ కమ్యూనిజం పట్ల తనకు ఉన్న తీవ్ర విద్వేషాన్ని ఎన్నడూ దాచిపెట్టుకోలేదు. కమ్యూనిస్టు రష్యాను హిట్లర్ ఓడించి తీరతాడని ఈ పెట్టుబడిదారీ దేశాలు గట్టిగా నమ్మాయి. ఈ గుడ్డి నమ్మకంతోనే హిట్లర్ యూరప్ దేశాల మీద యుద్ధానికి దిగినప్పుడు అతన్ని నిలవరించడానికి ప్రయత్నించలేదు. హిట్లర్ ఫాసిజాన్ని తిప్పికొట్టడానికి 'ఫ్రంట్' కడదాం రమ్మని స్టాలిన్ ప్రతిపాదించినపుడు బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ దేశాలు గట్టిగా తిరస్కరించాయి. హిట్లర్ తన సైన్యాన్ని ఫ్రాన్స్ మీదకు నడిపించి ఆ దేశాన్ని ఓడించి, బ్రిటన్‌ను బెదిరించిన తరువాత ఆ దేశాలు కళ్లు తెరిచాయి, హిట్లర్ ప్రమాదాన్ని గ్రహించాయి. అయినా 'ఫాసిజానికి వ్యతిరేకంగా కలిసి పోరాడుదాం' అని స్టాలిన్ పదేపదే చేసిన ప్రతిపాదనలను నిర్లక్ష్యం చేశాయి. సోషలిస్టు రష్యాను హిట్లర్ ఓడించి తీరతాడన్న ఆశలు పెట్టుకున్నాయి. ఈ ఆశలతోనే ఫాసిజంపై రెండవ దిక్కు నుంచి సాగించాల్సిన యుద్ధాన్ని అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాలు రెండేళ్లు ఆలస్యంగా మొదలుపెట్టాయి. ఇన్ని ఆటంకాల మధ్యన హిట్లర్ నాజీ సైన్యాన్ని ఎదుర్కొని, ఫాసిజాన్ని మట్టి కరిపించడంలో సోషలిస్టు రష్యా కీలక పాత్ర పోషించింది. ఈ యుద్ధంలో 2 కోట్ల మంది రష్యన్లు అసువులు బాశారు. 30 లక్షల మంది కమ్యూనిస్టు పార్టీ సభ్యులు యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. దేశీయ పరిశ్రమలు, వ్యవసాయం ఘోరంగా దెబ్బతినిపోయాయి. ఇళ్లు, స్కూళ్లు, ఆసుపత్రులు తదితర మౌలిక వసతులు శిధిలాల గుట్టలుగా మారాయి. స్టాలిన్ గ్రాడ్, లెనిన్ గ్రాడ్, కురుస్క్ ప్రాంతాలలో జర్మన్ ఫాసిస్టు మూకలను ఎదుర్కొని తిప్పికొట్టడంలో అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించారు. మాతృ దేశానికి చెందిన ప్రతి అంగుళం భూభాగాన్ని నిలబెట్టుకోవడానికి సోవియట్ సైన్యాలు భీకర పోరాటం సాగించాయి. రెడార్మీ సాధించిన ఈ విజయాలు చూశాక అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలకు హిట్లర్‌ను ఓడించవచ్చన్న నమ్మకం కలిగింది. హిట్లర్ సైన్యాన్ని సోవియట్ భూభాగం నుంచి నిర్ణయాత్మకంగా, విజయవంతంగా వెనక్కి తిప్పికొట్టడం మొదలవడం చూసి అప్పుడు పై మూడు దేశాలు జర్మనీ మీద రెండవ దిక్కు నుంచి దాడులు మొదలుపెట్టాయి. సోవియట్ రెడార్మీ కేవలం తమ భూభాగం నుంచి నాజీ సైన్యాన్ని తిప్పికొట్టడంతో సరిపెట్టుకోకుండా కమ్యూనిస్టు అంతర్జాతీయ స్ఫూర్తితో జర్మనీ రాజధాని బెర్లిన్ వైపుగా దూసుకుపోతూ అంతకు ముందు హిట్లర్ పాదాక్రాంతం చేసుకున్న యూరప్ దేశాల భూభాగాలను ఒకటొకటిగా విముక్తం చేశాయి. ఈ క్రమంలో ఫాసిస్టు ఆక్రమిత దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలు వీరోచిత పాత్ర పోషించాయి. ఆయా దేశాల్లో ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా ప్రతిఘటనా పోరాటాలు పెంపొందించడానికి, గెరిల్లా దాడులు నిర్వహించడానికి కృషి చేశాయి. అత్యంత ధైర్య సాహసాలతో సాగిన ఈ కృషికి విస్తృతమైన మన్నన లభించింది. హిట్లర్ ఓటమి చవిచూశాక నాజీ సైన్యం ఆక్రమించుకున్న అనేక దేశాల్లోని ప్రజానీకం కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేసుకొని తమ తమ దేశాలను సోషలిస్టు పంథా వైపు నడిపించే కృషి చేపట్టాయి. ఈ క్రమంలోనే అనేక తూర్పు యూరప్ దేశాలు కమ్యూనిస్టు దేశాలుగా అవతరించాయి. ఫ్రాన్స్, స్పెయిన్ వంటి పశ్చిమ యూరప్ దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు గణనీయమైన రాజకీయ శక్తిగా ఎదిగాయి. కమ్యూనిజం ప్రాభవాన్ని, సోషలిజం విస్తరణలను దృష్టిలో ఉంచుకుని బూర్జువావర్గం ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి అమెరికా యూరప్ పున:నిర్మాణానికి ఒక 'మాస్టర్ ప్లాన్' రూపొందించింది. పెట్టుబడిదారీ దేశాలు కూడా ఈ కాలంలోనే అనేక సామాజిక సంక్షేమ పథకాల అమలుకు పూనుకున్నాయి. 'సంక్షేమ రాజ్యా'ల భావన ఉనికిలోకి వచ్చింది. ఫాసిజాన్ని నిర్ణయాత్మకంగా ఓడించడంలో సోవియట్ సోషలిస్టు రష్యా, రెడార్మీ నిర్వహించిన మహత్తర పాత్రను తుడిచిపెట్టేదానికి పెట్టుబడిదారీ వర్గాలు శతథా ప్రయత్నించి విఫలమయ్యాయి. చరిత్రను వక్రీకరించడానికి సాంస్కృతిక రంగాన్ని ఒక సాధనంగా వాడుకున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం మీద హాలీవుడ్ నిర్మించిన సినిమాలు ఇందుకు ఒక ఉదాహరణ. ఈ యుద్ధంలో అమెరికా, బ్రిటన్‌లు పోషించిన పాత్రను ఎక్కువ చేసి చూపిస్తూ, రెడార్మీ నిర్ణయాత్మక పాత్రను కావాలనే తక్కువ చేసి చూపడమో లేదా పూర్తిగా విస్మరించడమో చేశాయి.

# విశాఖ భూములు కారుచౌకగా కట్టబెడుతున్నారు

ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించాలనే పేరుతో విశాఖలో అత్యంత విలువైన భూములను అతి తక్కువ ధరలకే కట్టబెట్టే ప్రయత్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిగమ్నమైంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో విశాఖలోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను చడీచప్పుడు కాకుండా కారుచౌకగా కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నది. ఇటీవల టాటా కన్సల్టెన్సీ సర్వీస్ లిమిటెడ్ (టిసిఎస్)కి హిల్ నెంబర్ 3లో 21 ఎకరాల భూములను కేటాయించారు. ఉర్సా కంపెనీకి దాని పక్కన, కాపులుప్పాడలోనూ భూమిని కేటాయించారు. టిసిఎస్ రూ.1370 కోట్ల పెట్టుబడులతో 12 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. టిసిఎస్‌కు ఎకరా 99 పైసలకే కేటాయించినట్లు వార్తలు వచ్చాయి. ప్రతిష్టాత్మక టిసిఎస్ ఇట్లాంటి ఒప్పందానికి ఎలా అంగీకరించింది? ఇది ప్రభుత్వం అత్యుత్సాహమా? వాస్తవం ఏంటనేది ప్రజలకు తెలియజేయాలి. ఆ పక్కనే ఉర్సా కంపెనీకి భూములు కేటాయించడం పట్ల కూడా ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. దీనికి ప్రధాన కారణం ఈ కంపెనీని 2025 ఫిబ్రవరి 12న ప్రారంభించారు. దీనికి కార్పొరేట్ గుర్తింపు (రిజిస్ట్రేషన్ నెంబర్ 193897) ఇచ్చారు. రూ.10 లక్షల పెట్టుబడితో ఏర్పడిన కంపెనీ ఇది. రెండు తెలుగు రాష్ట్రాల్లోను వేల కోట్ల పెట్టుబడి పెట్టడానికి ఎలా ఒప్పందం కుదుర్చుకున్నారు? ఈ కంపెనీకి ఇద్దరు మాత్రమే డైరెక్టర్లుగా వున్నారు. ఐటి రంగంలో కనీసం గుర్తింపు లేని కంపెనీ. ఇలాంటి కంపెనీకి టిసిఎస్ పక్కనే కేటాయిస్తే అంతర్జాతీయ గుర్తింపు వస్తుందనే కుట్ర దాగి వుందా? లేదా ఏ లాభాపేక్షతో ఉర్సాకు భూములు కేటాయించారు? ప్రభుత్వ పెద్దలే చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వంలో అనుకూలురు వుంటే కోట్లాది విలువ చేసే భూములను పొందవచ్చనేది ఉర్సా ఉదంతం తెలియజేస్తున్నది. ఉర్సా కంపెనీకి కేటాయించిన భూములపై అనేక అనుమానాలను విశాఖ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. నిజానిజాలను రాష్ట్ర ప్రభుత్వమే ప్రజలకు చెప్పాల్సి వుంది. ఉర్సా కంపెనీకి కేటాయించిన భూమి అత్యంత విలువైన భూమి. ఈ కంపెనీలతో జరిగిన ఒప్పందాలు అత్యంత రహస్యంగా వుంచాల్సిన దుస్థితి ఎందుకు దాపురించింది? మొదట ఎకరా 99 పైసలకే కేటాయించారని ప్రసార మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. ప్రభుత్వం వెంటనే ఎకరా 99 పైసలకు కాదని బదులిచ్చింది. ఒక కంపెనీతో ఎం.ఒ.యు కుదుర్చుకున్నప్పుడు ఆ కంపెనీ చరిత్ర తెలుసుకోవాలి. చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేస్తుందా? లేదా? అనే విశ్వాసనీయమైన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా భూములు కేటాయించినట్లు అర్థమౌతుంది. ఉర్సా క్లస్టర్ అంతర్జాతీయంగా పేరున్న నిపుణులతో ఏర్పాటయిన కంపెనీ అని, ఈ కంపెనీ రూ.5196 కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటు చేసి 2500 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తురదని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. విశాఖ ఐ.టి పార్కు దగ్గర హిల్ నెంబర్ 3లో 3.50 ఎకరాలు, కాపులుప్పాడలో 56 ఎకరాలు, మొత్తంమీద 60 ఎకరాలు కేటాయించారు. ఈ భూములు వేల కోట్ల రూపాయల ఖరీదైనవి. కాపులుప్పాడలో కేటాయించిన 56 ఎకరాలకు ఎకరా 50 లక్షలకే కేటాయించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అంటే 28 కోట్లకే కేటాయించారు. హిల్ టాప్‌పై ఉన్న 3.50 ఎకరాలను ఎకరా కోటి చొప్పున 3.50 కోట్లకే భూములు కేటాయించారు. ఇంత కారుచౌకగా ఊరు, పేరు లేని కంపెనీకి కేటాయించడం వెనుక ఆంతర్యం ఏమిటో ప్రభుత్వమే చెప్పాలి. ఇంత అడ్డగోలుగా భూములు కేటాయించి దానిని సమర్ధించుకొనే ప్రయత్నం చేయడం దుర్మార్గమైనది. విశాఖ ఆర్థిక రాజధాని. ఈ ప్రాంత అభివృద్ధికి కీలకమైన భూములు, కొండలను పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. ప్రభుత్వ స్థలాలకు రాష్ట్ర ప్రభుత్వం ట్రస్టీగా వుండి పరిరక్షించాల్సింది పోయి పెట్టుబడిదారులకు లీజుల పేరుతో కారుచౌకగా భూములు కట్టబెడుతున్నారు. భూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖ ఆర్కే బీచ్‌లో ఉన్న 13.43 ఎకరాల భూమిని లూలు కంపెనీకి కట్టబెట్టారు. అదాని డేటా సెంటర్‌కు 190 ఎకరాల భూమిని హిల్‌టాప్‌లో కేటాయించారు. గూగుల్ డేటా సెంటర్‌కు తర్లువాడ దగ్గర 250 ఎకరాలు కేటాయిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో కూడా నగరం నడిబొడ్డున విప్రో, సత్యం కంప్యూటర్స్‌కు ఇదే తరహాలో జరిగింది. తరువాత అది టెక్ మహేంద్ర కంపెనీగా మార్పు చెందింది. ఐటి సెజ్ హిల్ టాప్‌లో ఇప్పటికే ఐటి కంపెనీలు ఏర్పడ్డాయి. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో ఏర్పడిన కంపెనీల్లో ఎంత మందికి ఉపాధి కల్పిస్తామన్నారు? ఎంత మందికి కల్పిస్తున్నారు? వంటి వివరాలను బహిర్గతం చేయాలి. ఇలావుండగా, ఇటీవల కాలంలో అక్కడే ఉన్న ఐటి కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగులకు సరిగ్గా జీతాల చెల్లింపులు జరగడంలేదని ఆందోళనలకు దిగారు. విశాఖ ఆర్థిక రాజధాని. ఈ ప్రాంత అభివృద్ధికి కీలకమైన భూములు, కొండలను పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. ప్రభుత్వ స్థలాలకు రాష్ట్ర ప్రభుత్వం ట్రస్టీగా వుండి పరిరక్షించాల్సింది పోయి పెట్టుబడిదారులకు లీజుల పేరుతో కారుచౌకగా భూములు కట్టబెడుతున్నారు. భూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖ ఆర్కే బీచ్‌లో ఉన్న 13.43 ఎకరాల భూమిని లూలు కంపెనీకి కట్టబెట్టారు. అదాని డేటా సెంటర్‌కు 190 ఎకరాల భూమిని హిల్‌టాప్‌లో కేటాయించారు. గూగుల్ డేటా సెంటర్‌కు తర్లువాడ దగ్గర 250




ఎకరాలు కేటాయిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో కూడా నగరం నడిబొడ్డున విప్రో, సత్యం కంప్యూటర్స్‌కు ఇదే తరహాలో జరిగింది. తరువాత అది టెక్ మహేంద్ర కంపెనీగా మార్పు చెందింది. ఐటి సెజ్ హిల్ టాప్‌లో ఇప్పటికే ఐటి కంపెనీలు ఏర్పడ్డాయి. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో ఏర్పడిన కంపెనీల్లో ఎంత మందికి ఉపాధి కల్పిస్తామన్నారు? ఎంత మందికి కల్పిస్తున్నారు? వంటి వివరాలను బహిర్గతం చేయాలి. ఇలావుండగా, ఇటీవల కాలంలో అక్కడే ఉన్న ఐటి కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగులకు సరిగ్గా జీతాల చెల్లింపులు జరగడంలేదని ఆందోళనలకు దిగారు. ఎ.పి పారిశ్రామికంగా పురోభివృద్ధి చెందాలంటే, ఉపాధి అవకాశాలు రావాలంటే రాష్ట్రానికి ప్రత్యేక హెూదా సాధించడమే కీలకమైనది. నేడున్న కేంద్ర ప్రభుత్వానికి మన రాష్ట్ర కూటమి ప్రభుత్వం మద్దతు చాలా కీలకమైనది. కూటమి ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తే ప్రత్యేక హెూదా సాధించవచ్చు. ఫలితంగా అనేక కంపెనీలు రాష్ట్రానికి వచ్చే అవకాశాలున్నాయి. తద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయకుండా కూటమి నాయకులు ప్రభు భక్తి చాటుకుంటున్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టే విధంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రత్యేక హెూదా కోసం అన్ని పక్షాలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. విశాఖలో ఉర్సా కంపెనీకి కేటాయించిన భూములు అత్యంత విలువైనవి. ఈ ప్రాంతం పచ్చని కొండలతో నిండి వుంటుంది. ఇప్పుడు వాటిని ధ్వంసం చేస్తున్నారు. విశాఖ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడాలి. వికసిత ఆంధ్రప్రదేశ్‌లో పర్యావరణం చాలా కీలకమైనది విజన్ 2047లో రాష్ట్ర ప్రభుత్వం ప్రటించింది. ఈ దృష్ట్యా ఉర్సాకు కేటాయించిన భూములను వెనక్కి తీసుకోవాలి. లేదంటే ప్రజాగ్రహానికి గురికావల్సి వస్తోంది.

# మితిమీరిన వీధి కుక్కల దాడులు



ఇటీవల వెలువడిన ఒక సర్వే ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా సంభవించే రేబిస్ మరణాల్లో 36 శాతం మన దేశం నుంచే ఉంటుండటం ఆలోచించాల్సిన విషయం. అంతేకాదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఓ ) ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఈ వీధికుక్కల కాటు వల్ల ఏటా 18 వేల నుంచి 20 వేల మరణాలు సంభవిస్తుండటం, 30 నుంచి 60 శాతం మృతుల్లో అభం శుభం తెలియని చిన్నారులు ఎక్కువగా ఉంటుండటం మానవత్వం వున్న ప్రతి ఒక్కరి హృదయాలను తీవ్రంగా కలిచివేసే విషయం. అదేవిధంగా యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్-2001 ప్రకారం ఈ వీధి కుక్కల జనాభాను తగ్గించడానికి వాటికి స్టెరిలైజేషన్ టీకాలు వేయాల్సి ఉంటుంది. అయితే చాలా రాష్ట్రాల్లో నిధుల కొరతతో వీటికి టీకాలు వేయడంలో విఫలం అవుతుండటం ప్రజల పాలిట శాపంగా మారి, ఈ వీధి కుక్కల దాడులు వల్ల ప్రజల అమూల్యమైన ప్రాణాలకు ఏ మాత్రం గ్యారంటీ లేకుండా పోతోంది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఈ వీధి కుక్కల కాటు నుంచి దేశ ప్రజానీకానికి విముక్తి కలిగించాలంటే తక్షణమే మన కేంద్ర ప్రభుత్వం వారు యుద్ధ ప్రాతిపదికన కదలాలి. సంబంధిత శాఖ వారికి ఈ వీధి కుక్కల దాడులను అరికట్టే చర్యలకు పూనుకునేలా సిఫారసు చేయాలి. లేకపోతే ప్రతి ఏడాది వేలాది మంది విలువైన ప్రాణాలు ఈ వీధికుక్కల కాటు వల్ల అనంత వాయువుల్లో కలిసిపోతాయి. వీధి కుక్కల దాడుల విషయంలో తస్మాత్ జాగ్రత్త!

# మధ్యతరగతి ఎందుకు కొనలేకపోతున్నది?

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన మధ్యతరగతి నేడు కొనుగోలు తగ్గించుకుంటున్నది. గత అనేక దశాబ్దాలుగా ప్రభుత్వ విధాన నిర్ణయాలను తీవ్రంగా ప్రభావితం చేసిన ఈ వర్గం నేడు ఆ ప్రభుత్వాల విధానాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. పెరుగుతున్న ఖర్చులు-తరుగుతున్న ఆదాయాలతో ఆందోళన చెందుతున్నది. తమ గురించి, తమ పిల్లల భవిష్యత్ గురించి వేదనకు గురౌతున్నది. తమ దగ్గర వున్న కొద్దిపాటి డబ్బును ఖర్చు చేయడానికి భయపడుతున్నది. వీటన్నిటి ప్రభావం రియల్ ఎస్టేట్ వ్యాపారం, సరుకులు, వాహనాల కొనుగోలు రూపాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ తరగతితో శక్తికి మించి అప్పులు చేయించి లాభపడిన వ్యాపార సంస్థలు నేడు వ్యాపార లావాదేవీలు తగ్గిపోయాయని గగ్గోలు పెడుతున్నాయి. ఈ స్థితి నుండి తమను పాలకులు బయట వేస్తారనే విశ్వాసం కోల్పోయి, అతీతశక్తులను ఆరాధించడం పెరిగింది. గత మూడు దశాబ్దాల్లో ప్రపంచీకరణ విధానాలతో వేగంగా విస్తరించిన మధ్యతరగతి నేడు జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ పరిస్థితుల వల్ల తీవ్ర ఆందోళనకు గురౌతున్నది. ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ అంచనా ప్రకారం, రాబోయే పది సంవత్సరాల్లో మన దేశంలో మధ్యతరగతి కుటుంబాలు రెట్టింపు అవుతాయి. 2024లో 35 కోట్లుగా వున్న ఈ తరగతి 2034 నాటికి 69 కోట్లకు పెరుగుతుందని తెలిపింది. అందుకే దేశాభివృద్ధిలో ఈ తరగతి వినిమయం చాలా కీలకమవుతుంది. కార్పొరేట్ వ్యాపార సంస్థలు వీరిని ఆకర్షించి వ్యాపారాన్ని పెంచుకోవడానికి, ఊహల పల్లకిలో పెట్టి పాలకులు లాభపడడానికి, అసత్యాలు, అర్ధసత్యాలతో సంచలనాత్మక ప్రసారాలతో రేటింగ్ పెంచుకోవడానికి మీడియా నిత్యం అనేక ప్రయత్నాలు చేస్తుంటుంది. తమ అభివృద్ధికి అమెరికా డాలర్లను కొలమానంగా భావించే కొద్దిమంది మధ్యతరగతి వారు తమ పిల్లల భవిష్యత్ గురించి నేడు ట్రంప్ విధానాలతో భయాందోళన చెందుతున్నారు. దేశంలో 11 సంవత్సరాలుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉద్యోగ భద్రత లేకపోవడం, ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం, ధరలు పెరగడంతో మధ్యతరగతి ఖర్చు చేయడానికి భయపడుతుంది. తమ ఆదాయంలో ఎక్కువ భాగం అప్పుల వడ్డీలు, ఇఎంఐ లు చెల్లించడానికే సరిపోయే స్థితికి చేరింది. గత 25 సంవత్సరాల్లో వస్తువుల వాడకం, గృహ నిర్మాణం ద్వారా విస్తరించిన వినిమయ మార్కెట్ నేడు మందగించింది. ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ నిర్వహించిన సర్వే ప్రకారం దేశంలోని మొత్తం కుటుంబాల్లో 67 శాతం మంది వ్యక్తిగత రుణాలు తీసుకున్నారని, వీరిలో 53 శాతం మంది 30 ఏళ్ళ లోపు వారని తెలిపింది. ఇందులో అత్యధికులు ఐటి ఉద్యోగులు. వీరే నయా మధ్యతరగతివారు. రేపు లేదన్నట్లు ఖర్చు చేయగల ఖరీదైన వినిమయదారులు. రిజర్వ్‌బ్యాంకు రిపోర్టు ప్రకారం 2018లో మధ్యతరగతి వారు తమ ఆదాయంలో 30.4 శాతం అప్పుల చెల్లింపులకు ఖర్చు చేస్తుండగా, నేడు సుమారు 41 శాతం ఖర్చు చేస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున అప్పుల చెల్లింపులు వుండడంతో కొత్త సరుకులను కొనడం పట్ల ఆసక్తి చూపడంలేదు. దీని ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థ మీద తీవ్రంగా ఉంది. తయారీ రంగం విస్తరించకపోవడం, కొత్త ఉపాధి అవకాశాలు తగ్గడం, మధ్యతరహా వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ లాంటి రంగాలు కష్టాల్లో కూరుకుపోయాయి. హిందుస్తాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా సంస్థలు పట్టణాల్లో కొనుగోలు తమ అంచనాల కంటే ఎక్కువగా తగ్గిందని ప్రకటించాయి.

## నైరుతి రుతుపవనాల రాకపై చల్లని కబురు చెప్పిన ఐఎండీ



దేశ ప్రజలు, ముఖ్యంగా రైతులు ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది కేరళ తీరాన్ని కాస్త ముందుగానే పలకరించనున్నాయి. సాధారణంగా జూన్ 1న ప్రవేశించే రుతుపవనాలు, ఈసారి మే 27వ తేదీనే కేరళను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శనివారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఇది సాధారణ తేదీ కన్నా ఐదు రోజులు ముందు కావడం గమనార్హం.రుతుపవనాల ముందస్తు ఆగమనం ఖరీఫ్ పంటల సాగు పనులను త్వరగా ప్రారంభించేందుకు రైతులకు ఎంతగానో ఉపకరిస్తుంది. ఈ అంచనాతో రైతులు వ్యవసాయ పనులకు సన్నద్ధం కావడానికి వీలు కలుగుతుంది. భారత ప్రధాన భూభాగంలోకి రుతుపవనాల ప్రవేశానికి కేరళ ఆరంభమే ఒక ముఖ్యమైన సూచికగా పరిగణిస్తారు. వేడి, పొడి వాతావరణం నుంచి వర్షాకాలంలోకి మారడాన్ని ఇది సూచిస్తుంది. పైగా భారత్ కు అత్యధిక వర్షపాతాన్ని అందించేంది నైరుతి రుతుపవనాలే."ఈ సంవత్సరం, నైరుతి రుతుపవనాలు మే 27న కేరళలో ప్రవేశించే అవకాశం ఉంది. మా నమూనా అంచనాలో అటూఇటూగా 4 రోజుల వ్యత్యాసం ఉండవచ్చు" అని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కేరళలో రుతుపవనాల ప్రవేశ తేదీని అంచనా వేయడానికి ఐఎండీ ఆరు రకాల సూచికలను ఉపయోగిస్తుంది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 1న కేరళలో ప్రవేశించి, సుమారు ఏడు రోజుల ప్రామాణిక వ్యత్యాసంతో జూలై 8 నాటికి దేశవ్యాప్తంగా విస్తరిస్తాయి.2005 నుంచి కేరళలో రుతుపవనాల ప్రవేశ తేదీపై ఐఎండీ కార్యాచరణ అంచనాలను జారీ చేస్తోంది. ఇందుకోసం దేశీయంగా అభివృద్ధి చేసిన అత్యాధునిక స్టాటిస్టికల్ నమూనాను ఉపయోగిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ నమూనాలో అటూఇటూగా 4 రోజుల దోషానికి అవకాశం ఉంటుంది. గత 20 సంవత్సరాల (2005–2024) గణాంకాలను పరిశీలిస్తే, 2015 మినహా మిగిలిన అన్ని సంవత్సరాల్లోనూ ఐఎండీ అంచనాలు దాదాపుగా సరైనవేనని తేలింది. 2015లో మాత్రం అంచనా వేసిన తేదీ (మే 30) కన్నా వాస్తవ ప్రవేశం (జూన్ 5) నాలుగు రోజుల పరిమితిని దాటింది.ఐఎండీ తన నమూనాలలో ఉపయోగించే ఆరు ప్రధాన సూచికలలో వాయువ్య భారతదేశంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు, దక్షిణ ద్వీపకల్పంలో రుతుపవనాలకు ముందు కురిసే వర్షపాతం, ఉపఉష్ణమండల వాయువ్య పసిఫిక్ మహాసముద్రంపై సగటు సముద్ర మట్ట పీడనం, దక్షిణ చైనా సముద్రంపై అవుట్‌గోయింగ్ లాంగ్‌వేవ్ రేడియేషన్ (%జూా=%), ఈశాన్య హిందూ మహాసముద్రంలో దిగువ ట్రోపోస్ఫిరిక్ జోనల్ గాలి, మరియు ఇండోనేషియా ప్రాంతంలో ఎగువ ట్రోపోస్ఫిరిక్ జోనల్ గాలి వంటివి ఉన్నాయి.కాగా, ఈ ఏడాది (జూన్–సెప్టెంబర్) వర్షాకాలంలో దేశవ్యాప్తంగా 'సాధారణం కంటే ఎక్కువ' వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ గత నెలలోనే అంచనా వేసిన విషయం తెలిసిందే. ఇది రైతులకు మరింత ఊరటనిచ్చే అంశం.

## కాల్పుల విరమణ... అయినా పాక్ ను నమ్మొద్దంటున్న నేతలు



భారత్, పాకిస్థాన్ మధ్య సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్తతలు చల్లారాయి. ఇరు దేశాల సైనిక దళాల మధ్య భూమి, గాలి, సముద్ర మార్గాలన్నింటిలోనూ కాల్పుల విరమణకు ఒప్పందం కుదిరింది. ఇరు దేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) స్థాయి అధికారుల మధ్య జరిగిన సంభాషణ అనంతరం ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ ఒప్పందం సాయంత్రం 5 గంటల నుంచి తక్షణమే అమల్లోకి వచ్చింది. అయితే, కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినా సరే... పాకిస్థాన్ ను మాత్రం నమ్మొద్దని పలువరు భారత రాజకీయనేతలు అభిప్రాయపడ్డారు. పాక్ ను ఓ కంట కనిపెడుతుండాలని సూచించారు.సిద్ధరామయ్య (కర్ణాటక ముఖ్యమంత్రి): కాల్పుల విరమణను స్వాగతిస్తూనే, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "భారత్, పాకిస్థాన్ రెండూ అంగీకరిస్తే మంచిదే. అయితే, మనం అప్రమత్తంగా ఉండాలి... కాల్పుల విరమణ ఉన్నప్పటికీ, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంపై దృష్టి సారించాలి" అని అన్నారు.భగవంత్ మాన్ (పంజాబ్ ముఖ్యమంత్రి): కాల్పుల విరమణను స్వాగతిస్తూ, నిఘా అవసరాన్ని నొక్కిచెప్పారు. "కాల్పుల విరమణ ప్రకటించడం శుభవార్త, కానీ పంజాబ్ అప్రమత్తంగా ఉంటుంది. మా అంతర్జాతీయ సరిహద్దులో యాంటీ–డ్రోన్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తాం" అని చండీగఢ్‌లో విలేకరుల సమావేశంలో ప్రకటించారు.శశి థరూర్ (కాంగ్రెస్ ఎంపీ): కాల్పుల విరమణ అత్యవసరమైనదని, ఆలస్యంగా జరిగిందని అభివర్ణించారు. "శాంతి అత్యవసరం... నాకు చాలా సంతోషంగా ఉంది. భారత్ ఎప్పుడూ దీర్ఘకాలిక యుద్ధాన్ని కోరుకోలేదు. ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పడానికే భారత్ యుద్ధం చేసింది, ఆ గుణపాఠం చెప్పబడింది" అని అన్నారు.కపిల్ సిబల్ (రాజ్యసభ ఎంపీ): కాల్పుల విరమణను స్వాగతిస్తూ, ఇది పాకిస్థాన్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాల నిర్మూలనకు దారితీయాలని నొక్కిచెప్పారు. "కాల్పుల విరమణను నేను స్వాగతిస్తున్నాను, ఇరుపక్షాలను అభినందిస్తున్నాను. ఇప్పుడు యుద్ధంతో సంబంధం లేని అమాయకుల ప్రాణనష్టం చూడము... వారు (పాకిస్థాన్) దీనిని ఆపి, ఈ ఉగ్రవాద శిబిరాలను తొలగించి, అవి ఈ దేశంలో ఉగ్రవాదానికి కేంద్రాలుగా మారకుండా చూడాలి. అది కొనసాగినంత కాలం, ఈ సంఘర్షణ కొనసాగుతుంది, తాత్కాలిక కాల్పుల విరమణ ఎప్పటికీ శాశ్వతం కాదు" అని ఆయన అభిప్రాయపడ్డారు.

## కాల్పుల విరమణపై స్పందించిన జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా



భారత్, పాకిస్థాన్ మధ్య శనివారం జరిగిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్వాగతించారు. అయితే, ఈ నిర్ణయం రెండు మూడు రోజుల ముందే తీసుకుని ఉంటే అమాయకుల ప్రాణాలు దక్కేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాల్పుల వల్ల నష్టపోయిన పౌరులకు తక్షణమే సహాయక చర్యలు చేపట్టాల్సి ఉందని అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాల్పుల విరమణ నిర్ణయంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. "కాల్పుల విరమణను నేను స్వాగతిస్తున్నాను. ఇది రెండు మూడు రోజుల క్రితమే జరిగి ఉంటే, మనవైపున కోల్పోయిన ప్రాణాలు దక్కేవి. పాకిస్థాన్ డీజీఎంఓ మన డీజీఎంఓకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణ అమలైంది. నష్టం జరిగిన ప్రాంతాలను గుర్తించి, ప్రజలకు సహాయం అందించాల్సిన బాధ్యత ప్రస్తుత జమ్మూకశ్మీర్ ప్రభుత్వంపై ఉంది" అని ఒమర్ అబ్దుల్లా అన్నారు.గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం అందించడంతో పాటు, ప్రభుత్వ పథకాల కింద నష్టపరిహారం కూడా అందించాల్సి ఉందని అన్నారు."కాల్పుల వల్ల చాలా నష్టం జరిగింది. నష్టాన్ని వెంటనే అంచనా వేసి, నివేదిక పంపాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు వెళ్లాయి. నష్టపోయిన వారికి సహాయం అందించడం ప్రారంభిస్తాం" అని ఆయన పేర్కొన్నారు. సరిహద్దు ఉద్రిక్తతల కారణంగా నిలిచిపోయిన విమాన సర్వీసుల వల్ల కలిగిన అంతరాయాన్ని కూడా అబ్దుల్లా ప్రస్తావించారు. "మన విమానాశ్రయం చాలా రోజులుగా మూసివేయబడింది. కాల్పుల విరమణ తర్వాత విమానాశ్రయం తిరిగి తెరుచుకుంటుందని ఆశిస్తున్నాం" అని ఆయన తెలిపారు.

## పాకిస్థాన్ ఆ నరహంతకులను భారత్‌కు అప్పగించాల్సిందే: సుబ్రహ్మణ్యస్వామి



కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ, ఈ ఘాతుకానికి పాల్పడిన దోషులను తక్షణమే భారత్‌కు అప్పగించాలని బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి పాకిస్థాన్‌ను డిమాండ్ చేశారు. ఈ మేరకు పాకిస్థాన్‌పై భారత్ తీవ్ర ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు.పహల్గామ్‌లో చోటుచేసుకున్న అత్యంత హేయమైన సంఘటనను గుర్తుచేస్తూ, 26 మంది హిందూ పర్యాటకులను వారి భార్యల కళ్లెదుటే అత్యంత కిరాతకంగా హతమార్చారని స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారుణానికి ఒడిగట్టిన హంతకులను కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్)కు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ అమానవీయ చర్యకు పాల్పడిన వారిని 'నరహంతకులు'గా అభివర్ణించిన స్వామి, వారిని భారతీయ చట్టాల పరిధిలోకి తీసుకువచ్చి, కఠినంగా శిక్షించాలని అన్నారు. బాధితులకు న్యాయం జరగాలంటే, దోషులను భారత్‌కు అప్పగించడం తప్పనిసరి అని ఆయన నొక్కి చెప్పారు.

## భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ.. స్పందించిన ఐక్య రాజ్య సమితి




భారత్, పాకిస్థాన్ మధ్య కీలక పరిణామం చోటు చేసుకుంది. రెండు దేశాలు తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించడంతో సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ శాంతియుత చర్యను ఐక్యరాజ్యసమితి (ఐరాస) సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ స్వాగతించారు.శనివారం ఈ విషయంపై ఐరాస స్పందించింది. ఉద్రిక్తతలను తగ్గించేందుకు జరుగుతున్న అన్ని రకాల ప్రయత్నాలను తాము స్వాగతిస్తున్నామని గుటెర్రస్ పేర్కొన్నట్లు ఆయన ఉప ప్రతినిధి ఫర్హాన్ హక్ తెలిపారు."మేము పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాము. అయితే వివాదాన్ని తగ్గించే అన్ని ప్రయత్నాలను మేము స్వాగతిస్తున్నాము" అని ఫర్హాన్ హక్ పీటీఐ వార్తా సంస్థకు వెల్లడించారు.గత కొన్ని రోజులుగా ఇరు దేశాలు ఒకరి సైనిక స్థావరాలపై మరొకరు దాడులు చేసుకున్నాయి. ఈ తరుణంలో కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం గమనార్హం. ఈ దాడులతో ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న వివాదం మరింత తీవ్రరూపం దాల్చి, ప్రమాదకర స్థాయికి చేరుకుంది. అమెరికా మధ్యవర్తిత్వంతో ఈ కాల్పుల విరమణకు మార్గం సుగమమైందని ట్రంప్ ప్రకటించారు.

## భారత్-పాక్ కాల్పుల విరమణ: అమెరికా కీలక పాత్ర



అణుశక్తి దేశాలైన భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలుత ప్రకటించడం అంతర్జాతీయంగా ఆసక్తి రేపింది. కొద్ది సేపటికే, భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించారు. "రెండు దేశాల డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓలు) మధ్యాహ్నం 3:35 గంటలకు చర్చలు జరిపారు. భూమి, సముద్రం, గగనతలంలో అన్ని రకాల కార్యకలాపాలను నిలిపివేయాలని నిర్ణయించారు. తదుపరి చర్చలు మే 12న జరుగుతాయి" అని మిస్రీ తెలిపారు.అయితే, ఈ పరిణామం అనూహ్యంగా చోటుచేసుకుంది. కేవలం ఒక రోజు ముందే, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఫాక్స్ న్యూస్‌తో మాట్లాడుతూ, భారత్–పాకిస్థాన్ వివాదం "ప్రాథమికంగా మాకు సంబంధం లేని విషయం" అని వ్యాఖ్యానించారు. అయితే, ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని ట్రంప్, తాను ఇరు దేశాలను ప్రోత్సహిస్తున్నామని కూడా ఆయన పేర్కొన్నారు. కానీ, ట్రంప్ స్వయంగా ఎక్స్ మరియు తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ ద్వారా కాల్పుల విరమణ ప్రకటన చేయడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది.ట్రంప్ ప్రకటన అనంతరం, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో కూడా ఎక్స్‌లో ఇదే విధమైన పోస్ట్ చేస్తూ కాల్పుల విరమణను ధృవీకరించారు. "గత 48 గంటలుగా, ఉపాధ్యక్షుడు వాన్స్ మరియు నేను భారత, పాకిస్థాన్ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపాం. ప్రధానులు నరేంద్ర మోదీ, షెహబాజ్ షరీఫ్, విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్, జాతీయ భద్రతా సలహాదారులు అజిత్ దోవల్, అసిమ్ మాలిక్‌లతో చర్చించాం" అని రూబియో వివరించారు. తక్షణ కాల్పుల విరమణకు, తటస్థ వేదికపై విస్తృత అంశాలపై చర్చలు ప్రారంభించడానికి భారత, పాకిస్థాన్ ప్రభుత్వాలు అంగీకరించినందుకు సంతోషంగా ఉందని, శాంతి మార్గాన్ని ఎంచుకున్నందుకు ప్రధానులు మోదీ, షరీఫ్‌ల విజ్ఞత, దార్శనికతను అభినందిస్తున్నామని ఆయన అన్నారు.ఈ కాల్పుల విరమణ ప్రకటన వెలువడటానికి ముందు, పాకిస్థాన్ భవిష్యత్తులో ఏదైనా ఉగ్రచర్యకు పాల్పడితే దాన్ని యుద్ధ చర్యగా పరిగణించి, తదనుగుణంగా స్పందిస్తామని భారత్ కీలక హెచ్చరిక జారీ చేసింది. గత మూడు రాత్రులుగా ఉత్తర భారతదేశంలోని సైనిక స్థావరాలు, పౌర ప్రాంతాలపై పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులు చేస్తున్న నేపథ్యంలో ఈ హెచ్చరిక ప్రాధాన్యతను సంతరించుకుంది. సోమవారం (మే 12) భారత్, పాక్ మధ్య చర్చలు జరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.ఇప్పుడు కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం, తదుపరి చర్చలు ఇరు దేశాల మధ్య శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పుతాయని ఆశిస్తున్నారు.

## కాల్పుల విరమణ ఒప్పందంపై స్పందించిన కాంగ్రెస్



భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ఈ మొత్తం ఉదంతాన్ని పార్లమెంటుకు వివరించాలని ప్రభుత్వాన్ని కోరింది.భారత్, పాకిస్థాన్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయని, ఇందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈరోజు సాయంత్రం ఐదు గంటల నుంచి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిందని భారత ప్రభుత్వం ప్రకటించింది. దీనికి రెండు దేశాలు అంగీకరించినట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు.కాల్పుల విరమణపై కాంగ్రెస్ పార్టీ నేత జైరామ్ రమేశ్ స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలను ఆహ్వానించాలని సూచించారు. పర్యాటకులపై ఉగ్రదాడి, తదనంతర ఉద్రిక్త పరిణామాలపై చర్చించడానికి, పార్లమెంటును ప్రత్యేకంగా సమావేశపరచాలని సూచించారు.

## కాల్పుల విరమణకు కట్టుబడి ఉన్నాం: భారత రక్షణ శాఖ స్పష్టీకరణ



భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిందని, దీనికి భారత త్రివిధ దళాలు కట్టుబడి ఉన్నాయని భారత రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో జరిగిన ప్రత్యేక మీడియా సమావేశంలో ఈ విషయాలను వెల్లడించారు.ఇండియన్ నేవీ కెప్టెన్ రఘు నాయర్ మాట్లాడుతూ, కొన్ని రోజుల క్రితం జరిగిన విషాదకర సంఘటనల అనంతరం భారత ప్రతిస్పందనలు సంయమనంతో, బాధ్యతాయుతంగా ఉన్నాయని తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని గౌరవిస్తూనే, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి భారత సైన్యం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. "మన దేశ రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టడానికి మేము సదా సిద్ధంగా ఉన్నాము" అని నాయర్ పేర్కొన్నారు.వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మాట్లాడుతూ, పాకిస్థాన్ ఒక తప్పుడు సమాచార వ్యాప్తికి పాల్పడిందని ఆరోపించారు. పోరాట సమయంలో భారత దళాలు మసీదులను లక్ష్యంగా చేసుకున్నాయన్న పాకిస్థానీ ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. "మేము అన్ని మతాల ప్రార్థనా స్థలాలను అత్యంత గౌరవిస్తాము. భారత సాయుధ దళాలు ఏ మతపరమైన ప్రదేశాలను లక్ష్యంగా చేసుకోలేదు" అని వ్యోమికా సింగ్ స్పష్టం చేశారు. ఈ ఘర్షణల వల్ల పాకిస్థాన్ భూభాగంలో, వారి వైమానిక స్థావరాలు మరియు సైనిక మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లిందని ఆమె తెలిపారు.ఈ మీడియా సమావేశంలో కల్నల్ సోఫియా ఖురేషి, అదనపు కార్యదర్శి రణధీర్ జైస్వాల్ కూడా పాల్గొన్నారు.

## ఉగ్రవాదంపై భారత్ వైఖరి మారదు

ఉగ్రవాదం విషయంలో భారత్ ఎల్లప్పుడూ దృఢమైన, రాజీలేని వైఖరిని అవలంబిస్తోందని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని దాని అన్ని రూపాల్లోనూ భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, భవిష్యత్తులో కూడా ఇదే విధానాన్ని కొనసాగిస్తుందని ఆయన తెలిపారు.మరో కీలక పరిణామంగా, కాల్పుల విరమణతో పాటు సరిహద్దుల్లో సైనిక చర్యలను నిలిపివేసేందుకు భారత్, పాకిస్థాన్ మధ్య ఒక అవగాహన కుదిరిందని మంత్రి జైశంకర్ వెల్లడించారు.